బీజేపీ ఇంటింటి ప్రచారం



కాచిగూడలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకుడు కన్నె రమేష్ యాదవ్

కాచిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు మంగళవారం కాచిగూడ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రూపొందించిన కరపత్రాలను గడపగడపకు పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రధాని నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలన్నారు. పార్టీ నేతలు మదుసూదన్‌రెడ్డి, పంకజ్‌కుమార్, కె.యాదగిరి, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాగభూషణం చారి

అంబర్‌పేట: బీజేపీ పార్టీకి భారీ మెజార్టీ సాధించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం చారి పేర్కొన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ బాగ్‌అంబర్‌పేట సీతా కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ.. బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

నల్లకుంట: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే నరేంద్ర మోదీ తిరిగి ప్రధాని కావాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్, బూత్ కో– ఆర్డినేటర్ ఎస్. నర్సింగ్‌రావు అన్నారు. దేశంలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ చాలా వరకు పరిష్కరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట టీఆర్టీ కాలనీ బూత్ నంబర్ 13లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. గడిచిన పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ఐదేళ్లలో కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల కరపత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. కమలం గుర్తుకు ఓటేసి కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో రెండోసారి కాషాయ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ 13వ బూత్ అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి బి.ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముషీరాబాద్: అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని మోహన్‌నగర్, అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ.. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. బీజేవైఎం నగర కార్యదర్శి విశాల్‌గౌడ్, ముషీరాబాద్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు ఆయుష్ పాల్గొన్నారు.

చిక్కడపల్లి: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. డివిజన్‌లోని చిక్కడపల్లి, వివేక్‌నగర్, కావువాడ, బాపునగర్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలను పంపిణీ చేసి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ.. దేశ రక్షణకు మోదీ మరోసారి ప్రధాని కావాలన్నారు. ఎ.వినయ్‌కుమార్, రఘుగౌడ్, శ్రీకాంత్, దామోదర్, రాజాగౌడ్, వీఎస్టీ రాజు, మహమూద్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



బి.సిరి (9.3), అశ్రిత(9.3).. కోటి పూజ (9.3), లక్ష్మీప్రసన్న (9.2), తాళ్ల ప్రసన్న (9.2) చరిత, 10/10

‘పది’లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ముషీరాబాద్ పరిధిలో 86.3 శాతం

9.3 జీపీఏ సాధించిన ముగ్గురు విద్యార్థులు

ముషీరాబాద్: పదో తరగతి ఫలితాల్లో ముషీరాబాద్ విద్యా మండలి పరిధిలో 86 శాతం ఉత్తీర్ణత సాధించారు. ముషీరాబాద్ విద్యా మండలి పరిధిలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 301 విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారిలో 260 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

- ఈ సందర్భంగా ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఈవో చిరంజీవి మాట్లాడుతూ.. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు తీసుకోవడంతో పాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల 86 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. తాము 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తారనే లక్ష్యంతో కృషి చేశామని, మంచి ఫలితాలు వచ్చాయన్నారు.
- ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9.3 గ్రేడ్ సాధించడంతో విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపా రాణి సన్మానించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నరేందర్ యాదవ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రత్నం తదితరులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో విద్యా మండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, నరేందర్‌యాదవ్

కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో..

కాచిగూడ: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు అత్యధిక శాతం మార్కులతో ప్రతిభను చాటారు. గతేడాది 65 శాతం ఫలితాలు రాగా.. ఈసారి 73 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కాచిగూడ ప్రభుత్వ హైస్కూల్ హెడ్‌మాస్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. కాచిగూడ ప్రాంతానికి చెందిన లాల్ మహమూద్ 8.5, సుస్మితాసింగ్ (ఇంగ్లిష్ మీడియం) 8.5 శాతం మార్కులతో పాఠశాలలో మెదటి స్థానంలో నిలిచారన్నారు. అంబర్‌పేట ప్రాంతానికి చెందిన హాసిని 8.3, సాయిరాజా (ఇంగ్లిష్ మీడియం), 8.3 శాతంతో రెండో స్థానంలో నిలిచారన్నారు. గతేడాది కంటే ఈసారి 8 శాతం ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ..

అంబర్‌పేట: పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు నమోదు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. గతేడాది 72 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 85 శాతం పాస్ అయ్యారు. విద్యాశాఖ డివిజన్ హిమయాత్‌నగర్ పరిధిలోని సెయింట్ పీటర్స్ ప్రభుత్వ పాఠశాలలో చదివే బాలిక భువనగిరి చరిత 10/10 జీపీఏ సాధించినట్లు డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి పేర్కొన్నారు.

స్కూల్ పేరు	పరీక్షకు హాజరైన విద్యార్థులు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
నల్లకుంట	16	16	100 శాతం.
సీతాఫల్ మండి	46	45	97.08 శాతం.
జమిస్తాన్‌పూర్	25	23	92 శాతం.
జామా ఉస్మానియా	63	55	87.3 శాతం
ముషీరాబాద్	77	65	84.4 శాతం
మాణికేశ్వర్‌నగర్	13	10	77 శాతం.
కవాడిగూడ	61	46	75 శాతం
మొత్తం	301	260	86.3 శాతం

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు..



విద్యార్థులతో కాకతీయ హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ నవీన్, ప్రిన్సిపాల్

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. టి.హరిప్రియ 10/10 జీపీఏ సాధించగా.. కె.భువనేశ్వర్ 9.8 జీపీఏ, కార్తీక్, హాసినీలు 9.7 జీపీఏ సాధించి మొదటి స్థానంలో నిలిచారు. 9.0 జీపీఏ పైన 8 మంది విద్యార్థులు 8.0 జీపీఏ పైన 16 మంది విద్యార్థులు, 7.0 జీపీఏ పైన 8 మంది విద్యార్థులు సాధించారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ గోక నవీన్, ప్రిన్సిపల్ రామరాజు బల్వంత్ రావు విద్యార్థులను అభినందించారు.

కవాడిగూడ: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 10జీపీఏ మార్కులు సాధించి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ ప్రిన్సిపల్ స్వర్ణలతారెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. 10/10 జీపీఏ మార్కులు సాధించిన విద్యార్థులతో పాఠశాల విద్యార్థులతో కలిసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఆమె మాట్లాడుతూ... తమ పాఠశాల నుంచి 220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రిన్సిపల్ స్వర్ణలతారెడ్డి, కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



ఇంగ్లిష్ యూనియన్ స్కూల్‌లో..

కాచిగూడ: నారాయణగూడలోని నారాయణ విద్యాసంస్థలో పదోతరగతి విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. మొత్తం 64 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. 389 మంది 9 జీపీఏ పైచిలుకు సాధించారు. ప్రతీ సబ్జెక్టుల వారీగా 1524 మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. పాఠశాల ఏజీఎం బాల పరమేశ్వర్, కో–ఆర్డినేటర్ ఆజాద్, ప్రిన్సిపాల్ హర్‌నీత్ కౌర్ తదితర భవాని, నూర్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంబర్‌పేట: ప్రేమ్‌నగర్‌లోని హైమావతి పాఠశాలకు చెందిన విద్యార్థులు వైష్ణవి, కల్యాణ్‌రామ్, సాయిచరణ్‌లు 10/10 జీపీఏ సాధించారు. 9 లోపు 21 మంది విద్యార్థులు జీపీఏను సాధించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

రెండు లక్షల మెజార్టీతో విజయం సాధిస్తా !

సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్



రాంనగర్ ప్రచారంలో పాల్గొన్న దానం

ముషీరాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు లక్షల మెజార్టీతో విజయం సాధిస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. తాము నిర్వహించిన పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం రాంనగర్ డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, రాంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ జుహేర్ హుస్సేన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారానికి మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి దానం నాగేందర్ పాల్గొన్నారు. బాకారం బొమ్మలగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి జీపుయాత్ర పలు బస్తీలలో నిర్వహించి ఓటర్లను కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం రిసాలగడ్డలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో దానం నాగేందర్ మాట్లాడుతూ.. తనపై సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.గౌరీశంకర్, సుబ్రహ్మణ్యప్రసాద్, అమ్జద్‌హుస్సేన్, సయ్యద్ హకీంహుస్సేన్, అనిల్‌కుమార్‌యాదవ్, సంగిశెట్టి జగదీశ్వర్, అంజిరెడ్డి, లోకేష్‌యాదవ్, వెంకట్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, దశరథ్, బి.వి.రమణ పాల్గొన్నారు.

బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం

జీహెచ్‌ఎంసీ డ్రైవర్‌పై పోక్సో కేసు

కాచిగూడ: మైనర్ బాలికను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన జీహెచ్‌ఎంసీ డ్రైవర్‌పై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డలో ఉంటున్న రాంచంద్రయాదవ్ అలియాస్ టిల్లు (25) జీహెచ్‌ఎంసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. నింబోలిఅడ్డకు చెందిన బాలికను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. మాటమార్చడంతో సదరు బాలిక జరిగిన మోసాన్ని గ్రహించి తల్లిదండ్రులకు చెప్పింది. వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

రైల్వే ప్లాట్ ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైల్వే ప్లాట్‌ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్.చారి తెలిపిన వివరాల ప్రకారం.. ప్లాట్‌ఫామ్–4 పై గుర్తు తెలియని వ్యక్తి (50) అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న భూపతివెంకటేశ్వర్లు



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రముఖ కవి యాకుబ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీపీఎస్‌కే ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీపీఎస్‌కే కన్వీనర్ భూపతివెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. శ్రీశ్రీ స్ఫూర్తితో భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని దీనికి విద్యార్థులంతా కంకణబద్ధులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామంటూ.. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఓయూ స్కాలర్ మహేందర్, జానీ, రవీందర్, శ్రీలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అభ్యుదయ కవి శ్రీశ్రీ జయంతి వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శ్రామిక కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ.. శ్రీశ్రీ కవిత్వం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిందన్నారు. ఆయన రచనలతో కార్మికులంతా స్ఫూర్తిని పొంది తమ హక్కుల కోసం పోరాడారని గుర్తు చేశారు. సాహితీవేత్త ఏబూసి నర్సింహ్మా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా మహే జబీన్, తెలంగాణ సాహితీ ప్రతినిధులు కె.ఆనందచారి, తంగిరాళ్ల చక్రవర్తి, రచయితలు నస్రీన్‌ఖాన్, ఎస్.కే.సలీమా తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి ’



బాగ్‌లింగంపల్లిలో ప్రచారం చేస్తున్న రావులపాటి మోజస్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజస్ తెలిపారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ.. విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులకు బ్రోచర్లు పంచుతూ.. ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. మున్నానాయక్, జీసస్, గౌస్, ఉన్నీసా, సాబేర్, నందిని, సునీల్ తదితరులు పాల్గొన్నారు.